## క్లుప్తంగా

### గోకారం చెరువులో డెవిల్ చేప లభ్యం



వలిగొండ : మండలంలోని గోకారం రామసముద్రం చెరువులో మత్స్య కార్మికులు చేపలు పడుతుండగా డెవిల్ చేప లభ్యమైంది. ఈ అరుదైన చేపను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

### పథకాలపై అవగాహన పెంచుకోవాలి

చౌటుప్పల్ : ప్రభుత్వ పథకాలపై చేనేతలు అవగాహన పెంచుకోవాలని చేనేత, జౌళి శాఖ జిల్లా ఏడీ శ్రీనివాస్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులతోపాటు, వస్త్ర నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు(మంగళవారం) పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులోని పద్మశాలీ కాలనీలోని ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఏడీ శ్రీనివాస్ వెంట నల్లగొండ, యాదాద్రి డీఓలు ప్రసాద్, బాలమోహన్‌రెడ్డి, ఏడీఓ సత్యనారాయణ, స్థానిక ఉద్యోగులు రాపోలు శ్రీరాములు, గోశిక ధనుంజయ్య, గోశిక ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

### 101 యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలో సోమవారం 101 యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు చేరాల సుధీర్, మాజీ అధ్యక్షులు వంగూరి బాలకృష్ణ, పుప్పాల రవి, వంగూరి క్రాంతికుమార్, చేరాల నవీన్, కట్కూరి లింగస్వామి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా చేరాల కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా వంగూరి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వంగూరి రాము, ప్రధానకార్యదర్శిగా చేరాల విక్రమ్‌కుమార్, కోశాధికారిగా వంగూరి శివశంకర్, సహాయ కార్యదర్శిగా వంగూరి బాలరాజు, క్రీడల కార్యదర్శిగా ధనమోని శివ, ప్రచారకార్యదర్శులుగా బాలమైసి నవీన్, చేరాల మహేందర్, సాంస్కృతిక కార్యదర్శిగా వంగూరి అరుణ్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన రంగ కల్పనకు రూ.28,500, పచ్చిపాల అనిల్‌కు రూ.10,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పడాల సతీష్‌చారి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి తోట శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు గొడిసె నాగభూషణ్‌గౌడ్‌లు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు.

### మాస్టర్ శ్రీనివాస్‌కు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

భువనగిరి: పట్టణానికి చెందిన కుంగ్‌ఫూ మాస్టర్ మామిడాల శ్రీనివాస్‌కు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. 25 సంవత్సరాలుగా మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు చేస్తున్న సేవలకుగాను వైఎంకే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు భానుచందర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

### పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆలేరురూరల్: ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం కొలనుపాకలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొలనుపాకలో సర్వే నంబర్ 8లో గల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతు ప్రవీణ్, బొద్దు ఆంజనేయులు, గ్యార భిక్షపతి, ఉపేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

### నేతన్న భరోసా పథకాన్ని అమలు చేయాలి

ఆత్మకూరు(ఎం): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న భరోసా పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పని కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రచ్చ గోవర్ధన్, వంగరి బుచ్చిరాములు, రచ్చ రమేష్, గుర్రం నర్సింహ, ఎలగందుల శ్రీనివాస్, నల్ల నర్సయ్య, దయానందం పాల్గొన్నారు.

# ఇన్‌చార్జ్ బాధ్యతలు మాకొద్దు!

- 10 గ్రామ పంచాయతీలకు ఐదుగురు రెగ్యులర్ కార్యదర్శులు
- మిగతా ఐదు గ్రామాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగింత
- ఇబ్బందులకు గురవుతున్న పంచాయతీ కార్యదర్శులు



మోత్కూరు : మోత్కూరు మండలంలో 10 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక్కో గ్రామ కార్యదర్శి ఉండాలి. అయితే 10 గ్రామ పంచాయతీలకు ఐదుగురు రెగ్యులర్ కార్యదర్శులే పనిచేస్తున్నారు. మిగతా ఐదు గ్రామాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ముశిపట్ల గ్రామ పంచాయతీ రెగ్యులర్ కార్యదర్శి ఆర్.క్రాంతికుమార్‌ను వలిగొండ మండలం వేములకొండ కార్యదర్శిగా రెండు నెలలుగా డిప్యుటేషన్‌పై పంపించారు. వలిగొండ మండలం గోకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌ను డిప్యుటేషన్‌పై ముశిపట్లకు వేశారు. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం కార్యదర్శి బొడ్డు యాదగిరిని దాచారం కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై 5 నెలల క్రితం నియమించారు. ఈయనకు అదనంగా ముశిపట్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రాగిబావి రెగ్యులర్ కార్యదర్శిగా పనిచేస్తున్న స్వాతికి అనాజిపురం, పనకబండ గ్రామ పంచాయతీలకు అదనంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పాటిమట్ల రెగ్యులర్ కార్యదర్శిగా పని చేస్తున్న కె.వెంకటేష్‌కు అదనంగా పాలడుగు కార్యదర్శి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సదర్శాపురం రెగ్యులర్ కార్యదర్శి లోడె రమేష్‌కు పాడిచేడు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

**అదనపు బాధ్యతలతో ప్రయాణ భారం**

ఇటీవల నూతనంగా తెచ్చిన ఫేషియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్ అమలు చేయడంతో ఇన్‌చార్జ్ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమపై ఆర్థిక భారం పడుతుందని, ప్రయాణ భారం పెరుగుతుందని, అదనంగా ఇన్‌చార్జ్ కార్యదర్శుల విధులు నిర్వర్తించలేమని కార్యదర్శులు కె.వెంకటేష్, లోడె రమేష్, ఎస్.స్వాతిలు ఈ నెల 2న ఎంపీడీఓ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు గ్రామాల విధులు నిర్వహించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఒక గ్రామానికి హాజరై మరో గ్రామానికి వెళ్లి ఫేషియల్, రికగ్నిజేషన్ అటెండెన్స్ పంపకపోతే రెండు గ్రామాల్లో విధులకు గైర్హాజరైనట్లేనని ఉన్నతాధికారులు పేర్కొంటుండటంతో ఇన్‌చార్జ్ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు మోస్తున్న వారు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారు.

> **అదనపు బాధ్యతలతో ఇబ్బందిగా మారింది**
>
> అదనపు బాధ్యతలతో ఆర్థికంగా భారం పడుతుంది. నూతనంగా వచ్చిన అటెండెన్స్ విధానంతో రెండు, మూడు గ్రామాల్లో హాజరు కావడం, క్షేత్ర స్థాయిలో హాజరు పంపడం చాలా ఇబ్బందిగా మారింది. మూడు గ్రామాలకు హాజరై ఆలస్యంగా హాజరు పంపితే గైర్హాజరు కిందే అధికారులు పరిగణిస్తున్నారు.
>
> – స్వాతి, రాగిబావి పంచాయతీ కార్యదర్శి

### రేషన్ డీలర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

భువనగిరి: రేషన్ డీలర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య కోరారు. ఈమేరకు సోమవారం భువనగిరిలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. వారిలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మన్నె యాదగిరి, కోశాధికారి ఉమాదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గంగదేవి మహేష్, ఉపాధ్యక్షుడు చింతకింద మల్లేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ రేషన్ డీలర్లు ఉన్నారు.

### విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి 23న చేపట్టే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ కోరారు. సోమవారం భువనగిరిలోని బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో భువనగిరి పట్టణ కార్యదర్శి ఈర్ల రాహుల్ అధ్యక్షతన భువనగిరి పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చింతల శివ మాట్లాడుతూ.. బంద్‌కు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల కార్తీక్, భవాని శంకర్, హాస్టల్ కమిటీ అధ్యక్షుడు సతీష్, అభినవ్, వాసుదేవ్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి : పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి రైతు బజార్ వరకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ సాయికృష్ణ సోమవారం తెలిపారు. కొత్త ఎల్‌టీ లైన్ వేయడంతోపాటు డీపీఆర్ మార్పు చేసే పనుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ చౌరస్తా, తాతానగర్, పాత శిల్ప హోటల్, జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మీనానగర్, ఏరియా ఆస్పత్రి, జలీల్‌పూర్, గ్రంథాలయం ఏరియాలో ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దేశ్‌ముఖి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో దేశ్‌ముఖి, పిలాయిపల్లి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని లింగవారిగూడెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు లింగవారిగూడెం, పుట్టపాక, సాయిగోనిబావి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దివ్య సోమవారం తెలిపారు. ఫీడర్ మరమ్మతులు చేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకే అందుతున్న సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

- గొంగిడి మహేందర్‌రెడ్డి

గుండాల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయని, అర్హులైన వారిని విస్మరిస్తున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గుండాల మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త నల్ల యాదయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం గొంగిడి మహేందర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు ఒంటెద్దు పోకడ పోవడం సరి కాదన్నారు. నియోజకవర్గంలోని అధికారులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు వింటున్నారని విమర్శించారు. ఎప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండదని, భవిష్యత్తులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందన్నారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎం.బాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, బబ్బూరి సుధాకర్, శ్రీనివాస్, నర్సిరెడ్డి, రాజు, దయాకర్, రాంమల్లు, రంజిత్‌రెడ్డి, అంజిరెడ్డి, గిరికత్తుల శ్రీనివాస్ తదితరులున్నారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తాం



బీబీనగర్‌లో రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని ఏఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన పేదవారికి ఆహార భద్రత కల్పించి, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భువనగిరి నియోజకవర్గంలోని 3,883 నూతన కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. భువనగిరి మున్సిపాలిటీలో 573, భువనగిరి మండలం 598, బీబీనగర్ 578, పోచంపల్లి 816, వలిగొండ 1418 జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వితంతులకు ఆర్థికసాయంగా భువనగిరి తహసీల్దార్ పరిధిలో 46 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు, 38 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్‌చిస్తీ, డివిజన్ రెవెన్యూ అధికారి కృష్ణారెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ ఓటమితో ప్రజల దరిద్రం పోయింది**

బీబీనగర్: తెలంగాణలో బీఆర్‌ఎస్ ఓటమితో ప్రజల దరిద్రం పోయిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం బీబీనగర్ మండలంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, డీఎస్‌ఓ రాధరమణి, ప్రత్యేకాధికారి సుభాషిణి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పింగళ్‌రెడ్డి, శ్యామ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రామాంజనేయులుగౌడ్, బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలి



మోత్కూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మోత్కూరు : ఆర్టీసీ బస్సుల్లో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రయాణికుల భద్రత అవగాహన కోసం సోమవారం మోత్కూరు కొత్త బస్టాండ్‌లో తన సిబ్బందితో కలిసి ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బస్సుల్లో జరుగుతున్న దొంగతనాలు, మోసపూరిత చర్యలు, సైబర్ నేరాలపై ప్రయాణికులకు సూచనలు చేశారు. బస్సుల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా బంగారం దుకాణ యజమానులతో పోలీస్‌స్టేషన్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. బంగారం దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోత్కూరు ఎస్‌ఐ కొంపెల్లి సతీష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి




మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

భువనగిరిటౌన్ : సంగారెడ్డి జిల్లా పాశం మైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్రంగా గాయపడిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున చెల్లించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా, గొరిగే సోములు, సిలివేరు రమాకుమారి, జిల్లా సహాయ కార్యదర్శులు మాయ కృష్ణ, తుర్కపల్లి సురేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### జీఎంపీఎస్ మహాసభల కరపత్రం ఆవిష్కరణ



మహాసభ కరపత్రం విడుదల చేస్తున్న కాపరులు

బొమ్మలరామారం : రాయిగిరిలో మంగళవారం, బుధవారం నిర్వహించే గొర్రెల మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు బుడుమ శ్రీశైలం కోరారు. సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలను సోమవారం బొమ్మలరామారం మండలంలోని మైలారం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం పోరాట ఫలితంగానే కాపరులకు రుణాలు, ఎక్స్‌గ్రేషియా జీఓ, ప్రభుత్వ భూముల్లో మేత కోసం జీఓలను సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల కార్యదర్శి జెట్ట చిరంజీవి, ఉపాధ్యక్షులు బాంద్ర ఐలయ్య, మోటే రమేష్, బండ సంతోష్, బుడుమ అజయ్, కడెం నరేష్, బండ శ్రీరాములు, చీర గణేష్, బండ సంజీవ, బుడుమ రమేష్, బండ బీరుమల్లు, తదితరులు పాల్గొన్నారు.

### సంక్షిప్త సమాచారం

**నేడు మంద కృష్ణమాదిగ రాక**

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లో ఆగస్టు 12న నిర్వహించే వికలాంగుల, చేయూత పెన్షనర్ల మహాగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ భువనగిరిలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి మంద కృష్ణమాదిగ వస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వృద్ధులు, వితంతులు, గీత, బీడీ కార్మికులు, వికలాంగులు, పింఛన్‌దారులు తరలిరావాలని కోరారు.

**29న జిల్లా విస్తృత స్థాయి సమావేశం**

భువనగిరిటౌన్ : చౌటుప్పల్‌లో ఈనెల 29న సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయని పేర్కొన్నారు.

**సీసీరోడ్డుకు శంకుస్థాపన**

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు యాదగిరిగుట్ట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోపి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భూషోల్ల శ్రీనివాస్, శిఖ అరవింద్, కర్రె జహంగీర్, గోపి వెంకటస్వామి, గుల్గెన్ జాంగీర్, కృష్ణస్వామి, కరుణాకర్, రాములు, వెంకటయ్య, బాబు, దావీదు, మధు తదితరులు పాల్గొన్నారు.

**దీటి కృష్ణయ్యకు నివాళి**

మోత్కూరు : బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు దీటి సందీప్ తండ్రి దీటి కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. సోమవారం పాడిచేడు గ్రామంలోని సందీప్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిబాబా, తుంగతుర్తి కోకన్వీనర్ కూరాకుల వెంకటేశ్వరరావు, బూత్ అధ్యక్షులు బండ నర్సింహ్మ, పోతరబోయిన నర్సింహ, మాజీ మండల అధ్యక్షులు పోచం సోమయ్య, వెంకటేష్, గోపాల్, సాయి, కనకరాజ్, నర్సింహ పాల్గొన్నారు.

**విద్యుదాఘాతంతో ఎద్దు మృతి**

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో అంబటి వేణు అనే రైతుకు చెందిన ఎద్దు సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ లేక పోవడంతో ఎద్దు మేత మేస్తూ దానికి దగ్గరగా వెళ్లడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని వాపోయాడు.

### కృష్ణకౌండిన్యకు ముట్నూరు కృష్ణారావు పురస్కారం



కృష్ణకౌండిన్యకు పురస్కారం అందజేస్తున్న యోగా గురువు రవిశంకర్, గజల్ శ్రీనివాస్

రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య సాహితీ రంగానికి విశేష సేవలు అందిస్తున్నందుకుగాను ముట్నూరి కృష్ణారావు జాతీయ సాహితీ పురస్కారం అందుకున్నారు. ఈనెల 20న హిందూపురంలో నిర్వహించిన సదస్సులో భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీ సత్యసాయిజిల్లా రచయిత వేదిక సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువు రవిశంకర్, శ్రీనివాస్ పురస్కారం అందజేశారు.

### స్వర్ణగిరీశుడికి నవకలశ పంచామృతాభిషేకం

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నవకలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవ సేవ, రాత్రి సమయంలో కర్పూర మంగళ హారతులు సమర్పించారు.

### ఆలయ మాడ వీధిలో శునకం



ఆలయ మాడ వీధిలో భక్తుల నడుమ తిరుగుతున్న శునకం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ మాడ వీధిలో భక్తుల నడుమ శునకం సంచరిస్తోంది. ప్రశాంత వాతావరణంలో కూర్చోనివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని భక్తులు వాపోతున్నారు. గతంలో మాడ వీధిలో తిరుగుతున్న శునకం ప్రధానాలయంలోకి వెళ్లిందని, అయినా ఆలయాధికారుల తీరులో మార్పు రావడం లేదని పేర్కొంటున్నారు. శునకాలను కొండపై నుంచి తరలించాలని భక్తులు కోరుతున్నారు.

### నేడు రామన్నపేటలో రేషన్ కార్డుల పంపిణీ

రామన్నపేట : మండలానికి 887 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ఈ కార్డులను మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా.. 3,073 మంది పేర్లు పాత రేషన్‌కార్డుల్లో కలిపారు. మొత్తంగా 3,960 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

## విజ్ఞానంతోనే సామాజిక అంతరాలు దూరం



ప్రభుత్వ విప్‌కు పుస్తకం అందజేస్తున్న నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు

భువనగిరిటౌన్ : విజ్ఞానంతోనే సమాజంలోని సామాజిక అంతరాల దూరం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. భువనగిరిలోని పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించారు. సందర్భంగా మాట్లాడుతూ సమాజ మార్పు కోసం ఇలాంటి నాలెడ్జ్ సెంటర్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని సెంటర్ నిర్వాహకులు సురుపంగ శివలింగం, భానోతు భాస్కర్ నాయక్, బొట్ల రమేష్‌లను అభినందించారు. సెంటర్‌కు బీర్ల ఫౌండేషన్ నుంచి పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్ వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, నాయకులు ఎండీ అతహర్, కోళ్ల శివ పాల్గొన్నారు.

### రూ.5 క్యాంటిన్ ఏర్పాటు చేయాలి

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీలో ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేసి రూ.5కు భోజనం అందించే విధంగా చూడాలని పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రానికి అనేక మంది నిరుపేదలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని, క్యాంటిన్ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రంథాలయ చైర్మన్ అవేజ్‌చిస్తీ, షాదీఖానా చైర్మన్ ఏజాజ్, కాంగ్రెస్ నాయకులు షరీఫ్, మజహర్, మాజీ కౌన్సిలర్లు అహ్మద్, వెంకట్ నాయక్ ఉన్నారు.

# నిఘా నేత్రంపై నిర్లక్ష్యం



సాయిగుడెం చౌరస్తాలో తీగలతో అల్లుకొని పనిచేయని సీసీ కెమెరాలు



మందనపల్లి గ్రామంలో కిందకు వంగిన సీసీ కెమెరాలు


- సీసీ కెమెరాలు నేలచూపు
- మరమ్మతులు చేయకుండా చోద్యం
- నిందితుల గుర్తింపులో జాప్యం

ఆలేరురూరల్: మున్సిపాలిటీలో 150, గ్రామీణ ప్రాంతాల్లో 192 సీసీ కెమెరాలను దాతల సహకారంతో ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 54 సీసీ కెమెరాలు మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో నిందితులను పట్టుకోవడంలో పోలీసులకు సవాల్‌గా మారింది. సాయిబాబ గుడి వద్ద 2, ఎంపీడీఓ కార్యాలయం వద్ద 2, సంతోషిమాతగుడి వద్ద-2, మంతపురి రోడ్డు (బ్రిడ్జి వద్ద)-2, వివేకనంద విగ్రహం వద్ద 3, దుర్గమ్మ గుడి వద్ద- 3, బస్టాండ్- 3లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొద్దిచోట్ల సీసీ కెమెరాలు ఉన్నా అలంకారప్రాయంగా మారాయి.

**పనిచేయని 288 కెమెరాలు**

ఆలేరు మండల వ్యాప్తంగా గతంలో 342 సీసీ కెమెరాలు ఉన్నాయి. అందులో 54సీసీ కెమెరాలు మాత్రమే పని చేస్తుండడం గమనార్హం. మిగతా 288 సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కాలం ముగియడంతో నిర్వహణ భారంగా మారింది. విద్యుత్ హెచ్చుతగ్గులు కారణంగా సీసీ కెమెరాలు కాలిపోతున్నాయి. నార్మల్ ఫైబర్ కేబుల్ వాడటం, కోతుల బెడద, వడగండ్లవాన, గాలిదుమారం, నిర్వహణలేమి తదితర కారణాలతో సీసీ కెమెరాలు మరమ్మతులకు గురవుతున్నాయి, నెలలు గడుస్తున్నా వీటిని పట్టించుకోవడం లేదు.


**ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలి**



ఆలేరు మండలంలో చోరీలు ఎక్కువ జరుగుతున్నాయి. పోలీసులు దొంగలను ఛేదించడంలో విఫలమవుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే కొంత వరకు నిందితుల ఆచూకీ తెలుస్తుంది. ప్రధాన రహదారిలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– బైరి మహేందర్, సాయిగూడెం

**మరమ్మతులు చేయిస్తాం**



ఆలేరు మండల పరిధిలోని ప్రధాన కూడళ్లలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మరి పలుచోట్ల సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వాటికి త్వరలో మరమ్మతులు చేయిస్తాం. ఇళ్లు, దుకాణాలు, అపార్ట్‌మెంట్లు, భవంతుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– కొండలరావు, ఎస్‌హెచ్‌ఓ, ఆలేరు మండలం